క్లుప్తంగా

వైభవంగా ధైర్యలక్ష్మీ నారాయణుల కల్యాణం



పాత గుంటూరు: అరండల్ పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం ధైర్యలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ నిర్వహణలో అభిషేకాలు, కుంకుమ పూజలు, హారతి, మంత్రపుష్పం, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ట్యాలీ కోర్సు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కడపలో ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరి ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 26 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు కడపలో 35రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పే ర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ఇంగ్లీషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్ ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 90004 87423 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



పొన్నూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పొన్నూరు రిటర్నింగ్ అధికారి ఎ.లక్ష్మీకుమారి హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల నిబంధనలపై అధికారులతో సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో, ప్రయివేటు ఇళ్లపై ఉన్న పోస్టర్లు, బ్యానర్లు తొలగించాల్సి ఉందని చెప్పారు. ప్రయివేటు ఇళ్లపై ఉన్న వాటిని యజమానుల అనుమతి మేరకు తొలగించబోమని తెలిపారు. ఇంటిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే ఆ పార్టీ అభ్యర్థి ఖర్చు పరిధిలోకి వస్తుందన్నారు. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో ఏర్పాటు చేసే పార్టీ కార్యాలయాలకు ఆర్ఓ అనుమతి తప్పనిసరి అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో సభలకు పరిమితులకు లోబడి అనుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి వందశాతం అమలు చేయాల్సిందేనని తెలిపారు. ఆ మేరకు అధికారులు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, ఈఆర్వో హరిహరనాథ్, తహసీల్దార్ నారాయణ సింగ్, పట్టణ, రూరల్ సీఐలు భాస్కర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన ఫిలిం ఫెస్టివల్



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఫిలిం ఫెస్టివల్ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా విచ్చేయగా చిత్ర పరిశ్రమ నిపుణులు, చిత్ర నిర్మాతలు, ఔత్సాహికులు పెద్దసంఖ్యలో పాల్గొని లలిత కళల విభాగం విద్యార్థులకు చిత్రపరిశ్రమ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగ కల్పన విభాగం డీన్ డాక్టర్ ఎన్.వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకాంత్ రూపొందించిన ఫొటోబుక్‌ను యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ బెంజిమన్ గైని, అసిస్టెంట్ సినిమాటోగ్రఫీ అభినంగం విడుదల చేశారని, శ్రీకాంత్ వర్ధమాన చలనచిత్ర నిర్మాతల విభిన్న ప్రతిభను మరియు సృజనాత్మకతను ప్రదర్శించే షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శనలకు హాజరైన వారిని అభినందించారని తెలిపారు. కేఎల్‌యూ లలిత కళల విభాగం రూపొందించిన పేజెస్ టు పిక్చర్స్ పుస్తకాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్ ఆవిష్కరించారు. వర్శిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, విద్యార్థులు ప్రోగ్రెషన్, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్, ఉద్యోగ కల్పన విభాగం డీన్ డాక్టర్ ఎన్.బి.వి.ప్రసాద్, లలిత కళల విభాగాధిపతి యలవర్తి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విజయాన్ని అడ్డుకోలేరు

వైఎస్సార్ సీపీ అభ్యర్థి నూరి ఫాతిమా

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలోని ప్రగతి నగర్‌లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ దుష్ట కూటమి, ఎల్లో మీడియా కలిసి ఎన్ని కుట్రలు పన్నినా సీఎం జగన్ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు, ఎల్లో మీడియా డబ్బు నమ్ముకుని ముందుకు సాగుతుంటే.. సీఎం వైఎస్ జగన్ ప్రజలను నమ్ముకుని ముందుకు సాగుతున్నారన్నారు. పేద వర్గాల ప్రజలే వైఎస్సార్ సీపీకి స్టార్ క్యాంపెయినర్స్ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు వెంకటేశ్వరరావు, మాదాసు మాధవ్, అల్లం గోపి, సురేష్‌బాబు, స్వర్ణలత, మాధవ చిన్న, నాని, చంటి, ఆనంద్, శ్యామ్, సాంబ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి నూరి ఫాతిమా

వైఎస్సార్‌సీపీలో చేరిక

నియోజకవర్గంలోని 7వ డివిజన్‌కు చెందిన జనసేన పార్టీ ముస్లిం మైనార్టీ మహిళా నేతలు షేక్ ముబినా, సుల్తానా, ఆశియా, మరికొంత మంది వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా కార్యాలయంలో పార్టీ మైనార్టీ నాయకులు సలీం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పార్టీలో చేరిన వారికి నూరి ఫాతిమా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చూసి వైఎస్సార్ సీపీలో భారీగా చేరుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందన్నారు.

వైభవంగా శేషవాహనంపై శ్రీవారి నగరోత్సవం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విశ్వక్సేన ఆరాధన, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సభకు ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. శేషాచల ఆశ్రమం పీఠాధిపతి నిర్విక ల్పానందస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. సభలో కేంద్రశాఖ సంక్షేమ శాఖ చైర్మన్ వల్లూరి జయప్రకాష్ నారాయణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, విశ్రాంత న్యాయమూర్తి కేజీ శంకర్ పాల్గొన్నారు. సాహితీవేత్తలు మల్లాప్రగడ శ్రీమన్నారాయణ,



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

నోరి నారాయణమూర్తి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొని, బ్రహ్మోత్సవాల విశిష్టతను తెలిపారు.

ఎన్నికల బాండ్లపై చర్చా గోష్ఠి

లక్ష్మీపురం: దేశీయ బ్యాంకింగ్ రంగంలో అగ్రస్థానంలో ఉంటూ ప్రపంచ జాబితాల్లోనూ చోట సాధించిన ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల విషయంలో ఇలా వరుస పెట్టి సర్వోన్నత న్యాయస్థానంలో చీవాట్లు తినడం సరికాదని విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి సింగరయ్య అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిజాయితీ, పారదర్శకతలకు పెద్ద పీట వేయాల్సిన ఎస్‌బీఐ తనకు తానుగానే తప్పటడుగులు వేస్తూ.. పాలకుల ఒత్తిడికి లొంగిపోతోందన్నారు. సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల లోగా బాండ్ల రహస్యాన్ని బట్ట బయలు చేయాలని సమస్త వివరాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు ప్రసంగించారు.

ఉషోదయ సూపర్ మార్కెట్ ప్రారంభం

గుంటూరు రూరల్: స్థానిక ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్–2 విశాలమైన భవనంలో ఉషోదయ సూపర్ మార్కెట్‌ను బుధవారం ముఖ్య అతిథి క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉషోదయ సూపర్ మార్కెట్ యాజమాన్యం వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను సరసమైన ధరలకు అందించడం కోసం తమ బ్రాంచ్‌ను గుంటూరులో ప్రారంభించడం అభినందనీయమన్నారు. డాక్టర్ రమాబాల కాసరనేని జ్యోతి ప్రజ్వలన చేశారు. మరో అతిథి గుంటూరు పయినీయర్ గ్రూప్ సంస్థల ఎండీ చుక్కపల్లి పాల్గొన్నారు. ఉషోదయ సూపర్ మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ మన్నవ యుగంధర్ మాట్లాడుతూ రూ.1,299 కంటే ఎక్కువ సరుకులు కొనుగోలు చేసిన వినియోగదారులకు స్క్రాచ్ కార్డు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఇందులో గ్రాము గోల్డ్, 20 గ్రాముల సిల్వర్, మరికొన్ని ఉత్తేజకరమైన బహుమతులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. తమ వద్ద లభించే అన్ని బ్రాండ్ల ఉత్పత్తుల ఎమ్మార్పీ కంటే 5.4 శాతం కనీస తగ్గింపు ఉంటుందని ఆయన తెలిపారు.



సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఆళ్ల శివారెడ్డి

నగరపాలక సంస్థ మేనేజర్‌గా ప్రసాద్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ మేనేజర్‌గా ప్రసాద్‌ను నియమిస్తూ నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత మేనేజర్ వై.వి.ఎల్.శివన్నారాయణను జె సెక్షన్ సూపరింటెండెంట్, జె సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌ను మేనేజర్‌గా బదిలీ చేశారు.

ఆలయంలో చోరీ?

పట్నంబజారు: ఆలయంలో చోరి జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఆర్టీసీ బస్టాండ్ వెనుక కొల్లిశారదా మార్కెట్ వద్ద ఉన్న కనక దుర్గమ్మ ఆలయంలో బుధవారం చోరి జరిగినట్లు తెలిసింది. చోరికి పాల్పడిన నిందితుడు భక్తుడిలా వచ్చి ఆలయంలో ఉన్న పూజారికి రూ.500లు ఇచ్చి.. చిల్లర కావాలని చెప్పడంతో పూజారి చిల్లర తెచ్చేందుకు బయటకు వెళ్లాడు. నిందితుడు అమ్మవారి ముందు ఉన్న పలు విగ్రహాలపై ఉన్న బంగారాన్ని చోరి చేశాడు. నిందితుడు వెళ్లిన తరువాత గమనించిన ఆలయ పూజారి నిర్వాహకులకు తెలియజేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు. బంగారం ఎంత పోయిందనేది తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



విగ్రహ ప్రతిష్ట అనంతరం హనుమత్ లక్ష్మణ సమేత సీతారామ చంద్రస్వామి వార్లు



అర్చకుల ఆశీర్వదం పొందుతున్న అంబటి మురళీకృష్ణ

కిలారి, అంబటి ప్రత్యేక పూజలు

మంచాల(చేబ్రోలు): మండలంలోని మంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్త బృందం ఆధ్వర్యంలో హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి మందిర నిర్మాణాన్ని పూర్తి చేశారు. 16వ తేదీనుంచి పండితులు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలను చేపట్టారు. బుధవారం పరివార సమేత సీతారాములవారి ప్రతిష్టా కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ హోమాలు, విశేష పూజలు జరిగాయి. శాంతి కల్యాణం జరిగింది. మంచాల, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేలాది మందికి భక్తులు అన్న సంతర్పణ జరిగింది. గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు దంపతులు ప్రతిష్టా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమత్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి మందిర విగ్రహ ప్రతిష్టా మహోత్సవ సందర్భంగా వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వ్యక్తి మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించి పరిశీలించారు. అతని వద్ద 12 మద్యం బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనపరుచుకుని కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

తెనాలిరూరల్: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలి మెడలో గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు బుధవారం మధ్యాహ్నం దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో గొలుసును అపహరించుకెళ్లారు. దీనిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. మూడు సవర్ల గొలుసు అపహరణకు గురైందని బాధితురాలు చెబుతోంది.


విధుల నుంచి వలంటీర్ల తొలగింపు

గుంటూరు వెస్ట్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు జిల్లాలో ఎనిమిది మంది వాలంటీర్లను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వెనిగండ్ల సచివాలయ పరిధిలోని గ్రామ సచివాలయానికి చెందిన ఆరుమళ్ల మురళి, రామకృష్ణారెడ్డి, తక్కెళ్లపాడు పరిధిలోని ఎండూరి నిరంజన్, పరస మౌనిక, పరస శ్రీను, కొత్తపల్లి భవాని, పెనుమాల సురేష్, పెదకాకాని పరిదిలోని ఎస్.నాగవర్ధన్ రెడ్డి ఉన్నారు. వీరందరూ ఒక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతోపాటు ఫిర్యాదులందడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

అన్ని ప్రదేశాల్లో పటిష్ట నిఘా

ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు

ప్రత్తిపాడు: సత్ప్రవర్తనతో నడుచుకుంటూ వివాదాలకు దూరంగా ఉండాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎ.హనుమంతు రౌడీ షీటర్లకు సూచించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో బుధవారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అన్ని ప్రదేశాల్లో నిఘా నేత్రాలు ఉన్నాయని, ఎక్కడ, ఏ చిన్న గొడవకు పాల్పడినా వెంటనే తెలిసిపోతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ మేరకు రౌడీషీటర్లందరినీ ప్రత్తిపాడు తహసీల్దార్ ఎదుట వ్యక్తిగత పూచీకత్తుపై బైండోవర్ చేశారు. వెంట డీఎస్పీలు వీవీ నాయుడు, గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ ఎండీ మహబూబ్‌బాషా, సీఐ ఎండీ నిసార్‌బాషా, ఎస్‌ఐ సోమేశ్వరరావు పాల్గొన్నారు.




రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్ ఇస్తున్న అడిషనల్ ఎస్పీ హనుమంతు, డీఎస్పీలు

చెక్‌పోస్టు పరిశీలన..

బాపట్ల జిల్లా, గుంటూరు జిల్లాల మధ్య నియోజకవర్గంలోని పెదనందిపాడులో ఏర్పాటు చేసిన అంతర జిల్లాల చెక్‌పోస్టును గుంటూరుసౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా బుధవారం పరిశీలించారు. వాహనాలు తనిఖీ చేస్తున్న విధానాన్ని పరిశీలించి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు.

రైతులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామం శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా పంటను భద్రపరచుకుని నష్టపోయిన రైతులను న్యాయం చేయాలని ఏపీ పసుపురైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర రావు డిమాండ్ చేశారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో ఏపీ పసుపు రైతుల సంఘం ఆధ్వర్యంలో దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధితుల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగ్నిప్రమాద బాధితుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షత వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, న్యాయవాది కొండూరు వీరయ్య, రవికుమార్, రైతుసంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ప్రవర్తనా నియామవళి మేరకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లోని వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లను, బ్యానర్లను అనుమతి లేకుండా ఏర్పాటు చేసే సంస్థలు, వ్యక్తులు, ఏజెన్సీలపై పోలీసు కేసులు నమోదు చేయాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అధికారులకు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై స్టాటిస్టిక్స్ సర్వేలైన్స్ టీం, వీడియో గ్రాఫ్ వ్యూయింగ్ టీం, అకౌంట్స్ ఎక్స్‌పెండీచర్ బృందాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లో రాజకీయ ప్రకటనల ఏర్పాటుకు అవకాశం లేదన్నారు. నిబంధనలు మీరితే వారిపై పోలీసు కేసులు నమోదుకు చర్యలు తీసుకోవాలని ఎంసీసీ బృందానికి స్పష్టం చేశారు. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులు ప్రతి కార్యక్రమానికి రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకు తగిన విధంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సువిధ యాప్ సింగిల్ విండో కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేట్ భవనాలలో ఏర్పాటు చేసే హోర్డింగ్స్‌కు భవన స్ట్రక్చరల్, స్టెబిలిటి సర్టిఫికెట్ తప్పనిసరన్నారు. నగరపాలక సంస్థ కమర్షియల్ ప్రకటనల స్థలాలు, ప్రైవేట్ ప్రకటనల స్థలాల్లో ఉన్న బోర్డులను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిదికన ఇవ్వాలన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. నగరంలో సీటీ బస్సులు, ఆటోలపై రాజకీయ ప్రకటనలు ఉంటే తక్షణం కేసులు నమోదు చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్‌కి స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల క్రమంలో తాము చేపట్టే ర్యాలీలు, ప్రచార వాహనాలు, డోర్ టు డోర్ క్యాంపెయిన్, లౌడ్ స్పీకర్ల వినియోగం, తాత్కాలిక పార్టీ కార్యాలయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుచేయాలని, ఎక్కడా పక్షపాత వైఖరి ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఆర్ఓలు, వివిధ టీంల అధికారులు పాల్గొన్నారు.

31న రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్, ఆచారి

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమకు చేసిన మేలు, తద్వారా తాము పొందిన ప్రయోజనాన్ని నిజమైన బ్రాహ్మణులెవరూ ఎన్నటికీ మరువరని గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) స్పష్టం చేశారు. ఈ నెల 31న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణుల సమావేశం జరుగనున్న నేపథ్యంలో బుధవారం గుంటూరులో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. సదరు సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్ పాలన పగ్గాలు చేపట్టిన నాటి నుంచి బ్రాహ్మణుల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.300 కోట్లు కేటాయించి పూర్తిస్థాయిలో బలోపేతం చేసినట్లు తెలిపారు. కోవిడ్ కల్లోల సమయంలో అర్చకులందరికీ తలా రూ 5వేలు కేటాయించి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే కాక దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ప్రత్యేకంగా రూ.234 కోట్లు కేటాయించి ఆలయాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఆయన కృషి చేసినట్లు చెప్పారు. కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) మాట్లాడుతూ ఈ నెల 31న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే రాష్ట్ర స్థాయి బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నందిరాజు మీనాక్షి, కప్పగంతుల ఆదిలక్ష్మి, నిమ్మరాజు శారదాలక్ష్మి, వలివేటి వెంకటరమణ, కంతేటి శ్యామ్, రావినూతల హరిప్రసాద్, రాళ్ళబండి చందు, బడేకర్ నాగరాజు, మన్నేపల్లి హనుమంతరావు, యల్లాప్రగడ సుధ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం సీనియర్ సిటిజన్ల జీవితానుభవాలు



మాట్లాడుతున్న కైలాష్ నాథ్

గుంటూరు ఎడ్యుకేషన్: సీనియర్ సిటిజన్ల జీవితానుభవాలను వినియోగించుకుంటే సమాజం, ప్రభుత్వాలు ఆరోగ్యకరమైన దిశగా నడుస్తాయని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బైసాని కైలాష్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం అసోసియేషన్ నాలుగో సర్వసభ్య సమావేశాన్ని అరండల్ పేటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది సీనియర్ సిటిజన్లకు ఆక్సిలేట్ ల్యాబ్స్ సహకారంతో పూర్తి రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన కైలాష్‌నాథ్ మాట్లాడారు. 2007 వయో వృద్ధుల, తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టాన్ని ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వేలో సీనియర్ సిటిజన్ల రాయితీలను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని, ఆర్టీసీ బస్సుల్లో 25 శాతంగా ఉన్న ప్రయాణ రాయితీ 50 శాతానికి పెంచేలా చూడాలని కోరారు. రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యూవీవీ సాగర్, సహాధ్యక్షుడు ఏఎంజీ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, కోశాధికారి కె.కామేశ్వరరావు, సలహాదారులు సదాశివరావు ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

రూ.2 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకార వేతనాలు అందజేస్తున్న సాంబశివరావు, శివమోహన్, సుజాత

గుంటూరు ఎడ్యుకేషన్: సంపాదనలో కొంత భాగాన్ని పేద, బడుగు, బలహీనవర్గాల కోసం ఖర్చు చేయడం సామాజిక సేవగా భావిస్తున్నట్లు డీఎస్ కల్యాణ మందిరం మేనేజింగ్ ట్రస్టీ డోగిపర్తి అనంత సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం బ్రాడీ పేటలోని హంస జ్యూయలర్స్‌లో పేద విద్యార్థులకు రూ.2 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సాంబశివరావు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా బలహీన వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు సాయమందించడం వాసవీ మాత వరంగా భావిస్తున్నట్లు తెలిపారు. మరొక ట్రస్టీ శివమోహన్ మాట్లాడుతూ తమ అన్నదమ్ముల మూడు కుటుంబాలు ఏటా రూ.5 లక్షలు విద్యార్థులకు ఉపకార వేతనాలకు అందజేస్తున్నట్లు చెప్పారు. సుజాత, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, రామారావు, లక్ష్మణరావు, దీప్తి, హర్ష, చక్ర, ప్రత్యూష పాల్గొన్నారు.

31 వరకు పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ

నెహ్రూనగర్: పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీ రాయితీ గడువు ఈ నెలాఖరు లోపు ముగియనుందని, బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని పేర్కొన్నారు. నగరంలో ఇంకా సుమారు రూ.65 కోట్లు పన్ను బకాయి ఉందని, వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శులు పన్ను బకాయిదార్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా ఉంటుందన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డ్ సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు యథావిదిగా పనిచేస్తాయని తెలిపారు. పనున్నలు చెల్లించి నగరాభివృద్ధి సహకరించాలని పేర్కొన్నారు.